


# రైలు ప్రయాణం

— శారద

భోజనం చేసి, తీరికగా, టీవీ చూస్తూ, సినిమా తారలు వెలిబుచ్చుతున్న అభిప్రాయాలు వింటూ ఆనందిస్తున్నాను. పరీక్షలైపోయాయి మరి, అక్కడే కూర్చుని రన్నింగ్ కామెంటరీ చేస్తున్నాడు తమ్ముడు.

"ఇరవై నాలుగ్గంటలూ ఆ టీవీ ముందు అఘోరించకపోతే, కాస్త ఇలావచ్చి సాయం చేయకూడదూ' అంటూ సణుగుతోంది అమ్మ. ఎప్పటిలాగే దాన్ని మేమంత సీరియస్‌గా తీసుకోలేదు. గేటు చప్పుడైతే, తొంగి చూసిన తమ్ముడు.

"అక్కా, కొశ్చన్ బాంక్ వస్తోందే" అన్నాడు.

"కొశ్చన్ బాంక్" అంటే మా పక్కింటి పద్మ, నా స్నేహితురాలు, అది ఏ వాక్యాన్నయినా ప్రశ్నార్థకంగానే ముగిస్తుంది. అందుకేదానికా పేరు పెట్టాం.

"రమణి! ఈ వార్త తెలుసా?"

"తెలియదు,చెప్పు" అన్నాను టీవి మీంచి కళ్లు తిప్పకుండానే.

"విశ్వసుందరి పోటీ వివరాలు వార్తల్లో వస్తున్నాయి. నువ్ చూడవా?"

చకచకా ఛానెల్ మార్చాను.

"విశ్వసుందరి పోటీలు మా ఆడవాళ్లందరికీ వాళ్ల, సమస్యల్ని గురించి చర్చించటానికి ఒక వేదిక వంటిది. ఆ వేదిక మీద మేం మా అభిప్రాయాలని ప్రపంచానికి చాటుతాం" అంటున్నారు. విశ్వసుందరిగా ఎన్నికైన...

"ఎంతో చక్కగా చెప్పింది కదే?" అంది పద్మ. పిడుగు పడ్డట్టు ఇద్దరం ఉలిక్కిపడ్డాం. గొల్లుమని నవ్వుతున్నాడు మా తమ్ముడు.

"అయితే ఇప్పుడు ఆవిడ తన భావాలు ప్రచారం చేయడానికి ఒళ్లు కష్టపెట్టుకుని సర్జరీలు చేయించుకుని అందాల పోటీలో పాల్గొంటుందన్న మాట. పాపం వాళ్లెవరికీ రాజకీయాలు సైన్సు, సాహిత్యం, లలిత కళలు లాంటి రంగాల మీద నమ్మకం లేదేమో."

ఇద్దరం కిమ్మనలేదు.

"పోనీ, ఇంతవరకూ ఎన్నికైన సుందరీమణులు ఏ విషయం మీద ఏ అభిప్రాయాన్ని వెల్లడిచేసారో గుర్తుతెచ్చుకోండి".

"పోన్లేరా! డబ్బు, పేరు కోసం పోటీ చేస్తున్నామంటే ఎలాగెలుస్తారు చెప్పు?" అనునయంగా అన్నాను. ఈ సడింపుగా టీవీ వైపోసారి, మా వైపోసారి లుక్కేసి వెళ్లిపోయాడు వాడు.

వీడెప్పుడూ ఇంతే. క్రికెట్ చూద్దామంటే, మాచ్ ఫిక్సింగ్ వివరాలతో మూడంతా పాడు చేస్తాడు.

"రావే పద్మా, మేడపైన వెన్నెల్లో కూర్చుందాం" టీవీ ఆపేసి అన్నాను.

"అమ్మో! చలేయదూ?"

దానిక్కొంచెం ప్రాక్టికల్ థింకింగ్ ఎక్కువ. పరీక్షలు, చదువుకోవడం, సినిమాలు, టీవీ తప్ప దానికింకో ధ్యాస ఉండదు. ఉషోదయాలగురించీ, పూలఅందం గురించీ, మాట్లాడితే అది, "పరీక్షలకి నిద్రలేకుండా చదివి పైత్యం చేసిందేమో, నాలుగు రోజులు బాగా రెస్టు తీసుకుని చూస్తావా?" అని అడుగుతుంది.

"మే నెలలో చలేమిటి? నీ మొహం. పద పైకి" అని వెళ్లేంతలో ఆఫీసు నుంచి నాన్న వచ్చారు.

"అమ్మా! నాన్న వచ్చాడు" అంటూ పాడుతూ వచ్చాడు. తమ్ముడు.

"ఇంకోసారి ఆ పాట పాడావంటే కాళ్లిరగ్గొడతాను" అంటూ లోపల్నించి నాన్నకోసం మంచినీళ్లగ్లాసుతో వచ్చిందమ్మ. మంచినీళ్లుతాగి, కుర్చీలో చతికిలబడి, నాన్న

"మనందరం పదిరోజుల్లో మద్రాసు వెళ్లాలి"అన్నారు. ఆనందంగా.

"హా(!" ఢాంమని ఇంకో కుర్చీలో కూలబడ్డాను నేను.

"ప్రయాణమా!" నీరసంగా అంది అమ్మ.

"ప్రయాణమా!" అంటూ తమ్ముడు నవ్వాపుకోలేకపోయాడు. "మీరూరు వెళ్లొస్తే మనకి చాలా రోజులు ఆకబుర్లతో మంచి ఎంటర్‌టైన్‌మెంట్ కదురా చిన్నా?" అంది పద్మ తన్మయత్వంతో, క్రిందటిసారి మా ప్రయాణం తాలూకు విశేషాలు ఇంకా కథలు కథలుగా చెప్పుకుంటున్నారు, కాలనీలో.

"నువు నోర్మూయి, ఇంతకీ ఎందుకు నాన్నా ప్రయాణం?"

"మద్రాసులో రామ్మూర్తి వాళ్లమ్మాయి పెళ్లి, మనందరం వెళ్లక పోతే బాగుండదు"

ప్రయాణం గురించిన దిగులుతో మేము, సంతోషంతో పద్మ ఇంటికి, లేచాము. అసలు చిక్కంతా మేము సామాను సర్దటం దగ్గరే మొదలవుతుంది.

మా అమ్మ కళ్లకి మేమింకా చిన్న పిల్లల్లాగే కన్పిస్తాం కాబట్టి, "ఒక డబ్బానిండా పులిహోర, ఒక డబ్బానిండా కారప్పూస పట్టికెళ్తే దార్లో పిల్లలు ఆకలేసినప్పుడు తింటారు" అంటుంది చాదస్తంగా. మేమెప్పుడో, కోక్, పిజ్జా వయసులో కొచ్చేసామని అర్థం చేసుకోదు.

మా తమ్ముడికేమో. కర్చీఫ్ పట్టేసందు లేకపోయినా, కనీసం ఒక జాన్ గ్రేషం నవల లేకుండా ప్రయాణం చేయటం, గంటసేపైనా సరే ఇన్సల్ట్.

మా నాన్నగారికేమో, ఎండలు మండిపోతున్నా దుప్పట్లుండాలిసిందే.

"చలేస్తుందేమోనర్రా" అంటూ మనిషికి ఒకటి చొప్పున పట్టికెళ్లిన దుప్పట్లు విప్పను కూడా విప్పకుండా వెనక్కి తీసుకొస్తాము.

అందరం కలిసి రెండురోజుల ప్రయాణానికైనా మోపెడంత సామానవుతుంది!

ప్రయాణానికి నాలుగురోజుల ముందే పాకింగ్ అంతా అయిపోయినా, క్రిందటి సంవత్సరం విజయవాడ వెళ్లినపుడు అయిన రభస నాకింకా బాగా గుర్తుంది.

★★★

రైలుకి, ఇంకా నాలుగు గంటలుందనగా మా తమ్ముడు "రమణీ! మనందరి టూత్ బ్రషులూ, పేస్టూ పెట్టిన డబ్బా ఏదీ?" అనటంతో మొదలయింది.

"ఆ ఎర్ర బ్యాగులో పెట్టాకానీ, నువ్విప్పుడు అదంతా విప్పద్దు".

"నా బ్రెషు పెట్టావో లేదో?"

"ఏం మునిగి పోదులే. మనమేం అడవుల్లోకా వెళ్తుంది? వెళ్లాక ఊర్లో ఇంకోటి కొందాం. నువ్విప్పుడు సామానంతా విప్పద్దు."

"పొద్దున్నే పాచి మొహంతో షాపింగ్ వెళ్తామా ఏమిటి? ఆ ఒక్క బ్రష్ ఉందో లేదో చూస్తాను" అనటం ఏమిటి, అన్ని బాగ్‌లూ విప్పదీసి, బ్రష్ లేదని డిక్లేర్ కూడా చేసేసాడు.

ఎర్రబ్యాగ్‌లో పైనేఉన్న డబ్బాలోంచి బ్రష్ చూపించాను.

"ఐయామ్ సారీ సిస్టర్.నిజంగా బ్రష్‌లోపలే ఉంది." సంతోషంగా అన్నాడు. విప్పదీసిన సామానంతా చూసి, నాకేడుపొచ్చింది.

"ముందా సామానంతా లోపల పెట్టు" కోపంగా అన్నాను. సరే ఎలాగో ఆ సామానంతా మళ్లీ బ్యాగుల్లో, సూట్‌కేసుల్లో కూరేసి, ఆటో ఎక్కబోతుండగా, తేలుకుట్టినట్టు అరిచాడు వాడు.

"ఏమిట్రా, ఏమయింది?"

"టూత్ బ్రష్షులున్న డబ్బా గూట్లో మరచిపోయాను. ఇప్పుడే తెస్తాను" లోపలికి పరిగెత్తాడు.

"వీడే టూత్ బ్రష్షుల గొడవతో ప్రాణాలు తోడేస్తున్నాడు" పళ్లు నూరుకున్నా మందరమూ.

ఆఖరికో ఆడబ్బా పెట్టడానికి ఎందులోనూ చోటులేక ఒక ప్లాస్టిక్ సంచిలో చేత్తో పట్టికెళ్లాం! అదీ సంగతి!

★★★

అన్ని రోజుల్లాగే ఆ రోజూ తెల్లవారినా, మా ఇంట్లో హడావిడి.

"రైలు ఎన్నిగంటలకి" అడిగిందమ్మ.

"చార్మినార్ మధ్యాహ్నం మూడింటికి".

"అదేమిటి నాన్నా? చార్మినార్ సాయంత్రం ఆరింటికికదా! అన్నాన్నేను.

"ఉష్! మనం మూడింటికని చెపితే, మీ అమ్మ ఆరింటికి బయల్దేరుతుంది. స్టేషన్లో రైలు ఆలస్యమైందని చెప్పొచ్చు" నాకీ పద్ధతేం నచ్చకపోయినా, ఊరుకున్నాను. పన్నెండింటి నించే మానాన్న.

"సామానంతా రెడీనా? ఆటో తీసుకురానా?" అంటూ చిందులు తొక్కటం మొదలయింది.

"ఇదిగో, అయిపోయిందండి. రమణీ, ఈ సూట్‌కేసులు వాకిట్లో పెట్టేయి, నేను చీర మార్చుకుంటున్నాను."

"నీ చీరలు ఇంకా ఇస్త్రీ నించి రానిదే?" అన్నాను. "పిచ్చిదానా! అయిపోయిందంటే, నిజంగా అయిపోయిందేమిటి? నాన్న ఎప్పుడడిగినా, మనం అలా అంటూండాలి. కావాలంటే ఒక సూట్‌కేస్ బయటపెట్టు, ఎండ్ టేక్ యువర్ ఓన్ టైమ్. అంతేకానీ, మీ నాన్న లా తొందరపడితే, వెళ్లిన చోట విడిచిన బట్టలు కట్టుకుని గడపాల్సొస్తుంది." భగవంతుడా. బాటిల్ ఆఫ్ సక్సస్ మా ఇంట్లో చాపకింద నీరులా ప్రవహిస్తుంది. మానాన్న హడావిడి వల్లమేం నాలుగింటికే స్టేషన్ చేరుకున్నాం.

"ఇప్పుడు రెండుగంటలు ఇక్కడ కునికిపాట్లు పడాలి. నాన్నెప్పుడూ ఇంతే" అని విసుక్కుని మళ్లీ తన నవలలో తలదూర్చాడు మా తమ్ముడు.

మానాన్నేమో ఐదు నిముషాలకోసారి, రైలు వచ్చే టైమూ, ప్లాట్ ఫారం నెంబరూ, కంపార్టుమెంటు నెంబరూ సరి చూసుకుంటూ అటూ ఇటూ తిరుగుతున్నారు. ఉదయంనించీ పనితో అలిసిపోయిందేమో, పాపం అమ్మబెంచీమీద కూర్చుని నిద్రపోయింది. నేనేమో, అమ్మాయిల డ్రెస్సులూ వాటి ఖరీదులూ అంచనా వేస్తూ, నా దగ్గరున్న డ్రస్సులతో, "కంపేర్‌అండ్ కాంట్రాస్ట్"స్టడీ చేస్తున్నాను.

★★★

రైలు ధడధడా మంటూ రావటం, మేం తొక్కుకుంటూ తోసుకుంటూ, సామానంతా మోసుకుని కంపార్ట్‌మెంట్‌లో సీట్లలో కూలబడటం జరిగాయి.

నాకెందుకో టి.సి. వచ్చి మాటిక్కెట్లు చూసేదాక, మేమెక్కింది కరెక్టు రైలైనా. కంపార్టుమెంటూ, సీట్లనెంబర్లూ కరక్టేనా అని చచ్చేంత అనుమానం. టి.సి. లు వచ్చి వెళ్లేక

"హమ్మయ్య" అని వెనక్కివాలి కిటికీలోంచి బయటికి చూసాను.

మా తమ్ముడింకా నవల బయటికి తీయకుండా పాటలు మొదలుపెట్టాడు. వీడితో ప్రయాణం అందుకే నాకిష్టం ఉండదు. కిటికీలోంచి బయటికి చూస్తూ పాటలు పాడుతూ, భావుకుడిలా ఫీలైపోతూ ఉంటాడు. పైగా సందర్భోచితంగా పాడటం ఒకటి.


అంటే, బయట పూవులు కనిపించినపుడు.

"బహారో ఫూల్ బర్ సావో" అంటూ- పచ్చటి చేలు కనిపించినపుడు.

"సస్యశ్యామలదేశం, అయినా నిత్యం క్షామం" అంటూ బోరెక్కిస్తాడు.

ఆమధ్య రైల్లో మాతో బాటు కొత్తగా పెళ్లయిన జంటని చూసి.

"గాలివానలో వాననీటిలో



పడవ ప్రయాణం" అంటూ పాడి,దెబ్బలు తిన్నంత పనయి, ఇంటికొచ్చాడు. విసుగుపుట్టి అక్కడినించి లేచి,అవతలిపక్క వెళ్లికూర్చున్నాను.

నా కెదురుగా కూర్చున్నావిడని పరిశీలించసాగాను. సుమారు నలభై ఐదేళ్ల వయసుండొచ్చు.

మొహం శాంతంగా కాంతివంతంగా ఉంది, ఏదో పుస్తకం చదువుతోంది. ఒకసారి నావైపు కళ్లెత్తి చూసి, మెత్తగా నవ్వి, పుస్తకం మూసి" మద్రాసు దాకా వెళ్తున్నావా?" అంది. ఆవిడ నవ్వు ఎంతబాగుంది, అనుకుని, 'అవునండి 'అన్నాను. ఆవిడ చేతిలో ఉన్న పుస్తకం వైపు చూసాను.

'ఆలెస్ ఇన్ వండర్‌లాండ్" పేరు చూసి ఇలా చిన్న పిల్లల పుస్తకం చదువుతోందెందుకో, అనుకున్నాను. నా ఆలోచన పసిగట్టినట్టు.

"మనం పెద్దవాళ్లమవుతున్న కొద్దీ మనలో పిల్లలకుండే ఇమేజినేషన్, జీవితం మీద ఇష్టం, ఆసక్తి, తగ్గిపోతూ ఉంటాయి. వాటినలాగే ఉంచుకోవాలంటే, ఇలా అప్పుడప్పుడూ చిన్న పిల్లల పుస్తకాలు చదువుతూ ఉండాలి" నా కావిడ మాట్లాడుతుంటే ఇంకా వినాలనిపిస్తుంది. మా తమ్ముడెందుకో నన్ను చెయ్యెత్తి త్వరగా రమ్మని పిలుస్తున్నాడు.

"ఇపుడే మళ్లీ వస్తానండి" అంటూ అటు వెళ్లాను. "నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అడిగాడు.

"ఎవరు? నీకు తెలుసా ఆవిడ?" కుతూహలంగా అడిగాను.

"అందుకే, పేపర్లో సినిమాకబుర్లు, డైలీ సిరియల్ మాత్రమే కాకుండా మిగతా పేపరంతా చదవవే, అని చెప్తూ ఉంటాను. నువ్వేచూడు" అని ఆరోజు పేపరందించాడు. ఆవేళ్టి "సైన్స్ అండ్ టెక్నాలజీ" విభాగంలో. "ఈ సంవత్సరం విజ్ఞాన శాస్త్రానికి చెందిన అవార్డు గ్రహీత శ్రీమతి ఉమ గారు. అని ఆవిడ ఫోటో చూసి ఆశ్చర్యపోయాను. తేరుకుని మిగతా వ్యాఖ్య అంతా చదివాను. "ప్రముఖ రిసెర్చి సెంటర్... లో సైంటిస్టుగా పనిచేస్తున్న శ్రీమతి ఉమగారు ఫిజిక్స్‌లో సాధించిన విజయాలు..." అంటూ ఆవిడ పరిశోధన వివరాలు నాకు పెద్దగా అర్థం కాలేదు, కానీ నన్నాకట్టుకున్న విషయాలు.

"కేవలం వైజ్ఞానిక రంగంలోనే కాకుండా శ్రీమతి ఉమ తమ తీరిక వేళల్లో చుట్టుపక్కల గ్రామాల్లో పిల్లలకు విద్యనేర్పుతారు. స్థానిక మహిళాసంఘం కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని, అక్కడఉన్న స్త్రీల సమస్యల్ని తీర్చే ప్రయత్నం చేసారు.'

"హిస్టరీ ఆఫ్ వెస్టర్న్ ఫిలాసఫీ"పై వారు రాసిన వ్యాఖ్య ఈ మధ్య ప్రముఖ ఆంగ్లపత్రికలో ప్రచురితమైంది. శ్రీమతి ఉమగారు బహాముఖ ప్రజ్ఞాశాలి అనటంలో అతిశయోక్తి లేదు" ఇలా సాగిపోయింది వ్యాసం.

నాకెందుకో ఉన్నట్టుండి, రెండేళ్లక్రితం టి.వీ.లో మార్చి ఎనిమిదిన, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, చాలామంది ప్రముఖ స్త్రీలను ఒకే వేదికపై పరిచయం చేసిన కార్యక్రమం గుర్తొచ్చింది. ఆరోజు ఆ వేదిక పైన కిరణ్ బేడీనో, మహిళాశాస్త్రవేత్తలనో, రచయిత్రులనో, ఎం.ఎస్. లాంటి కళాకారిణులనో, కుటుంబాన్నంతా ఒక తాటి మీదనడుపుతూ శ్రమపడే గృహిణులనో చూడొచ్చుఅని అన్నారు కాలేజీలో మా లెక్చరర్. కానీ, నిన్నటి నేటి సినిమా టీవీ తారని బ్యూటీ పార్లర్స్ నడిపే స్త్రీలని కాస్మెటిక్ ఇండస్ట్రీ నడిపేవాళ్లని ఆహ్వానించి.

"నిజమైన స్త్రీకి అసలైన అందం ఏమిటి?" వంటి టాపిక్స్ మీద చర్చలు జరిపించారు. ఉమ గార్నడిగితే ఆ కార్యక్రమం గురించి, అందాల పోటీల గురించి ఏమంటారో! నవ్వొచ్చింది.

మళ్లీ ఆవిడవైపు చూసాను.

ఎన్నిరకాల మనుషులు ప్రపంచంలో! ఇలా రకరకాల వాళ్లతో పరిచయం జరిగి, జీవితాన్ని చాలా దగ్గరగా చూడాలన్న ఉద్దేశ్యంతో కాబోలు, నాన్న మమ్మల్ని ప్రతి సెలవుల్లో ఏదో ఒక వంకతో బయల్దేరదీస్తారు. ప్రయాణాల్లో మా హడావిడి గుర్తొచ్చి నవ్వుకున్నాను. కానీ, ప్రతిసారి మేమంతా నేర్చుకున్న "ఆర్గనైజేషన్" తెలిసొచ్చింది. అందుకే ప్రయాణం అనగానే విసుగుతో కూడిన ఉత్సాహం.

ఎవరి ఆలోచనలతోనూ ఇష్టాఇష్టాలతోనూ ప్రమేయం లేని జీవితంలా రైలు ప్రయాణం సాగుతూనే ఉంది.